## ఏడో బెటాలియన్ అదనపు కమాండెంట్‌కు ప్రమోషన్

డిచ్‌పల్లి, మే 31: డిచ్‌పల్లి ఏడో బెటాలియన్‌లో అదనపు కమాండెంట్‌గా విధులను నిర్వహిస్తున్న పి.సత్యనారాయణకు రాష్ట్ర ప్రభుత్వం కమాండెంట్‌గా ప్రమోషన్ కల్పించింది. అతడికి ఏడో బెటాలియన్ కమాండెంట్‌గా డిచ్‌పల్లిలో పోస్టింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా బెటాలియన్ అధికారులు, సిబ్బంది అతడిని మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాక్షలు తెలిపారు.

## డిగ్రీ పరీక్షల్లో ఒకరు డిబార్

డిచ్‌పల్లి, మే 31: తెలంగాణ యూనివర్సిటీ పరిధిలోని డిగ్రీ సీబీసీఎస్ బీఏ/బీకాం/ బీఎస్సీ/ బీబీఏ/ బీసీఏ 2, 4, 6వ సెమిస్టర్ రెగ్యులర్, 1, 3, 5వ సెమిస్టర్ బ్యాక్‌లాగ్ (2020 నుంచి 2024 బ్యాచ్‌ల) పరీక్షలు శనివారం ప్రశాంతంగా జరిగాయి. ఉదయం నిర్వహించిన పరీక్షలకు 5,627 మందికి 5,225 మంది హాజరవగా 401 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం నిర్వహించిన పరీక్షలకు 2,213 మందికి 2,008 మంది హాజరవగా 205 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని ఆడిట్ సెల్ డైరెక్టర్ ఆచార్య చంద్రశేఖర్ తెలిపారు.

## పండుగలను ప్రశాంతంగా జరుపుకోవాలి

చందూర్, మే 31: పండుగను ప్రజలు శాంతియుతంగా జరుపుకోవాలని ఎస్సై మహేశ్ అన్నారు. బక్రీద్ పండుగ సందర్భంగా మోస్రాలో పోలీసు బందోబస్తు ఏర్పాటుచేశారు. బందోబస్తును ఆయన శనివారం పరిశీలించారు. గోవులు అక్రమంగా రవాణా చేస్తు కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

## ఉచిత శిక్షణ శిబిరం ప్రారంభం



శిక్షణ శిబిరాన్ని ప్రారంభిస్తున్న అర్బన్ ఎమ్మెల్యే సూర్యనారాయణ గుప్తా

సుభాష్‌నగర్, మే 31: గంగాస్థాన్ మాధవ స్మారక సేవా సమితి ఆధ్వర్యంలో రామకృష్ణ సేవా సమితి ప్రాంగణంలో నిర్వహించనున్న ఉచిత కుట్టు శిక్షణ శిబిరాన్ని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళలకు ఉపాధి కల్పించే శిక్షణ సేవా కార్యక్రమాలను రామకృష్ణ సేవా సమితి నిర్వహించడం అభినందనీయమన్నారు. సమితి అధ్యక్షుడు మర్రి కృష్ణారెడ్డి, శ్రీనివాస్, గణేశ్, జుగల్‌జాజు, తులసీ, లత తదితరులు పాల్గొన్నారు.

## రైతు వ్యతిరేక చట్టాలను వెనక్కి తీసుకోవాలి

సిరికొండ, మే 31: కేంద్ర ప్రభుత్వం రైతు వ్యతిరేక చట్టాలను వెనక్కు తీసుకోవాలని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా నాయకుడు రమేశ్ అన్నారు. మండలంలోని తూంపల్లి గ్రామంలో అఖిల భారత ఐక్య రైతు సంఘం సభ్యత్వ నమోదును శనివారం ప్రారంభించారు. కేంద్ర ప్రభుత్వం కొత్త చట్టాలతో వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ సంస్థలకు అప్పగించే ప్రయత్నం చేస్తున్నదని ఆరోపించారు. కార్యక్రమంలో నాయకులు కిశోర్, దామోదర్, లింబాద్రి, రమేశ్, భూమాగౌడ్, ఎర్కన్న తదితరులు పాల్గొన్నారు.

## స్క్రూడ్రైవర్‌తో పొడుచుకొని ఆత్మహత్యాయత్నం

వినాయక్‌నగర్, మే 31: నగరంలోని గురుద్వారా ప్రాంతంలో నివసించే ఖాజా మొయినుద్దీన్ వ్యక్తిగత కారణాలతో శనివారం రాత్రి స్క్రూడ్రైవర్‌తో పొడుచుకొని ఆత్మహత్యాయత్నం చేశాడని పోలీసులు తెలిపారు. తీవ్ర రక్తస్రావం అవుతున్న అతడిని గమనించిన స్థానికులు 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. 108 సిబ్బంది రాములు, అజయ్ అక్కడికి చేరుకొని ప్రాథమిక చికిత్స నిర్వహించారు. అనంతరం మెరుగైన వైద్య సేవలు అందించడానికి జిల్లా ప్రభుత్వ దవాఖానకు తరలించారు.

# ఇసుక అందుబాటులో ఉండేలా చూడాలి

**తహసీల్దార్లతో కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు**



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు

కంఠేశ్వర్, మే 31: ఇందిరమ్మ ఇండ్లను నిర్మించుకుంటున్న లబ్ధిదారులకు ఇసుక, మొరం అందుబాటులో ఉండేలా చూడాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు తహసీల్దార్లకు సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో తహసీల్దార్లతో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన పలు సూచనలు చేశారు. లబ్ధిదారులకు ఇసుకను రవాణా చేసే వాహనాలకు ప్రత్యేకంగా వే బిల్లులను అందించాలని, అనుమతుల విషయంలో అనవసర ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. ఇందిరమ్మ ఇండ్ల పేరిట ఇసుక పక్కదారి పట్టకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. అవసరమైతే ఎంపీడీవోలు, ఎంపీవోలను సంప్రదించి ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు చేపడుతున్న లబ్ధిదారులను నిర్ధారణ చేసుకోవాలని సూచించారు. వర్షాలు ప్రారంభమైతే వాగులు, నదుల్లో వరద వచ్చి ఇసుక లభించదని, దీనిని దృష్టిలో పెట్టుకుని వానలు కురియక ముందే సరిపడా ఇసుక నిల్వలను ఇందిరమ్మ లబ్ధిదారులు ముందస్తుగా సమకూర్చుకునేందుకు వెసులుబాటు కల్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎక్కడ కూడా ఇసుక కొరత కారణంగా ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు నిలిచిపోయాయనే ఫిర్యాదు రాకూడదన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్, ఆర్డీవోలు రాజేంద్రకుమార్, రాజాగౌడ్ పాల్గొన్నారు.

## బిగాలను కలిసిన పద్మశాలీ సంఘం నూతన కమిటీ



మాజీ ఎమ్మెల్యే బిగాల గణేశ్‌గుప్తాతో పద్మాశాలీ సంఘం నూతన కార్యవర్గ సభ్యులు

ఖలీల్‌వాడి, మే 31: నూతనంగా ఎన్నికైన పద్మశాలీ సంఘ కార్యవర్గ సభ్యులు మాజీ ఎమ్మెల్యే బిగాల గణేశ్ గుప్తాను శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. నూతన అధ్యక్షుడు పెంట దత్తాద్రి, సభ్యులకు ఆయన శుభాకాంక్షలు తెలిపి, శాలువాలు కప్పి సన్మానించారు. బిగాలను కలిసిన వారిలో సంఘం ఉపాధ్యక్షులు ఎనుగందుల మురళి, కన్న, దుబ్బ రాజా, బాగుల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి చౌటి భూమేశ్వర్, కార్యదర్శులు అవధూత రాములు, ఎనుగందుల సుభాష్, భూస రవి, కోశాధికారి సాయిలు, శ్రీనివాస్, గంగరాజు, నాయకులు సత్యపాల్, మహేశ్, భాస్కర్ ఉన్నారు.

## చోరీలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

ధర్పల్లి, మే 31: గ్రామాల్లో తాళం వేసిన ఇండ్లను లక్ష్యంగా చేసుకొని దుండగులు దొంగతనాలకు పాల్పడుతున్న దృష్ట్యా ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఎస్సై రామకృష్ణ శనివారం ఒక ప్రకటనలో సూచించారు. తాళం వేసి బయటికి వెళ్లాల్సి వచ్చినప్పుడు ఇంట్లో విలువైన వస్తువులు ఉంచవద్దని తెలిపారు. దూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని పేర్కొన్నారు. విలువైన వస్తువులను బ్యాంక్ లాకర్‌లో దాచుకోవాలని, గ్రామాల్లో ఎవరైనా అనుమానితులు సంచరిస్తే పోలీపులకు సమాచారమివ్వాలని సూచించారు.

## ట్రాఫిక్ నియంత్రించాలి

వినాయక్‌నగర్, మే 31: నగరంలో ఫుట్‌పాత్ కబ్జాలను తొలగించి, ట్రాఫిక్‌ను నియంత్రించాలని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ అన్నారు. సీపీ సాయి చైతన్య, మున్సిపల్ కమిషనర్ దిలీప్‌కుమార్, అధికారులతో శనివారం సమీక్షను నిర్వహించారు. డ్రగ్స్ సరఫరా చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. విద్యాసంస్థల్లో మాదకద్రవ్యాలపై అవగాహన సదస్సులు నిర్వహించాలని సూచించారు. నగరంలో కొద్ది రోజులుగా నిర్ణీత సమయంలో దుకాణాలు మూసి ఉంచడంపై పోలీసుల పనితీరును ఎమ్మెల్యే అభినందించారు. ఏసీపీలు రాజావెంకట్‌రెడ్డి, మస్తాన్ అలీ, అధికారులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యలపై పోరాడాలి

ఖలీల్‌వాడి, మే 31: ప్రజా సమస్యలపై పోరాటాలు చేయాలని సీపీఎం నాయకులు పిలుపునిచ్చారు. పార్టీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కార్యకర్తలకు రాజకీయ శిక్షణా తరగతులను పార్టీ జిల్లా కార్యాలయంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ, అంతర్జాతీయ పరిస్థితులు, మహాసభల నిర్ణయాలను పార్టీ రాష్ట్రకమిటీ సభ్యుడు ప్రసాద్ వివరించారు. దేశంలోకి చొరబాటుదారులు రాకుండా అడ్డుకట్టవేయడంలో ప్రభుత్వం విఫయమైందని పేర్కొన్నారు. అమెరికాకు తలొగ్గి కేంద్ర ప్రభుత్వం ఉగ్రవాదులను పట్టుకోకుండానే యుద్ధం ముగించిందన్నారు. స్థానిక సమస్యలపై దృష్టిసారించాలని పార్టీ జిల్లా కార్యదర్శి పెద్ది వెంకట్రాములు సూచించారు. నాయకులు రమేశ్, రమేశ్‌బాబు, సుజాత, సురేశ్, గంగాధర్, ఎల్లయ్య, శిల్ప, లింగం, బాలయ్య, సాయిలు, భూమయ్య, అంజయ్య, అనీత, ఉద్దవ్, దినేశ్, విశాల్ తదితరులు పాల్గొన్నారు.

## పొగాకు వాడకాన్ని నిషేధించాలి



ఇందల్వాయిలో ర్యాలీ తీస్తున్న వైద్య సిబ్బంది

రుద్రూర్/ ఇందల్వాయి, మే 31: పొగాకు వాడకాన్ని నిషేధించాలని వైద్య సిబ్బంది సూచించారు. ధూమపాన వ్యతిరేక దినోత్సవాన్ని జిల్లావ్యాప్తంగా శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో ర్యాలీలు తీశారు. పలువురితో పొగాకు వ్యతిరేక ప్రతిజ్ఞ చేయించారు. రుద్రూర్ పీహెచ్‌సీలో డాక్టర్ ఆయేషా సిద్ధిఖా ఆధ్వర్యంలో పొగాకుతో కలిగే నష్టాలపై అవగాహన కల్పించారు. ఎల్టీ తరుణ్, సిబ్బంది పాల్గొన్నారు.ఇందల్వాయి పీహెచ్‌సీ వైద్యాధికారి సుశాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో ర్యాలీ తీశారు. ధూమపానంతో కలిగే నష్టాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో ఆయుష్ వైద్యాధికారి భువన, ఆరోగ్య విస్తీర్ణాధికారి వై.శంకర్, ఆరోగ్య పర్యవేక్షకులు అక్బర్‌అలీ, దేవపాల, ఆరోగ్య కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



వినాయక్‌నగర్, మే 31: ఉద్యోగ విరమణ పొందుతున్న సీసీ ఆర్బీ ఎస్సై చాందయ్య, డిచ్‌పల్లి ఎస్సై సత్యం, మోర్తాడ్ ఏఎస్సై శ్రీనివాసులు, మెండోరా కానిస్టేబుల్ సాబేర్ హుస్సేన్‌ను సీపీ సాయి చైతన్య సత్కరించారు. కమిషనరేట్‌లో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో వారికి శాలువాలు కప్పి సన్మానించారు. అదనపు డీసీపీ బస్వారెడ్డి, ఏవో ఆసియాబేగం, సీసీఆర్బీ, డిచ్‌పల్లి సీఐలు సతీశ్‌కుమార్, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణి వాయిదా

కంఠేశ్వర్, మే 31: రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం వేడుకల నేపథ్యంలో 2న నిర్వహించాల్సిన ప్రజావాణి కార్యక్రమాన్ని తాత్కలికంగా వాయిదా వేశామని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జూన్ 9వ తేదీ నుంచి ప్రతి సోమవారం ప్రజావాణి యథావిధిగా కొనసాగుతుందని పేర్కొన్నారు. విషయాన్ని ప్రజలు గమనించి సహకరించాలని కోరారు.

## ఎస్ఎస్ఆర్ కాలేజీకి అటానమస్ గుర్తింపు హర్షణీయం



మాట్లాడుతున్న ఎస్ఎస్ఆర్ విద్యాసంస్థల అధినేత మారయ్యగౌడ్

ఖలీల్‌వాడి, మే 31: ఎస్ఎస్ఆర్ కాలేజీకి యూజీసీ అటానమస్ గుర్తింపు ఇవ్వడం హర్షణీయమని ఎస్ఎస్ఆర్ విద్యాసంస్థల అధినేత మారయ్యగౌడ్, హరితా గౌడ్ అన్నారు. జిల్లాకేంద్రంలోని ఎస్ఎస్ఆర్ కాలేజీలో శనివారం సంబురాలు జరుపుకొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 33ఏండ్ల సుధీర్ఘ కృషితోనే అటానమస్ సాధ్యమైందన్నారు. ప్రత్యేక కోర్సులు ప్రవేశపెట్టి, నాణ్యమైన విద్యను అందించడంలో ప్రత్యేక స్థానం సంపాదించడంతో బీ ప్లస్ ప్లస్ గ్రేడ్ సాధించామని, ప్రస్తుతం అటానమస్ గుర్తింపు వచ్చిందన్నారు. నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్, మెదక్ ఉమ్మడి జిల్లాల విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఎస్ఎస్ఆర్ విద్యాసంస్థల డైరెక్టర్‌గా వారి కుమారుడు హర్షిత్‌గౌడ్‌ను నియమించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ దవాఖానలో యోగా డే

ఖలీల్‌వాడి, మే 31: అంతర్జాతీయ యోగా దినోత్సవం దశాబ్ది ఉత్సవాలు మే 27న ప్రారంభమయ్యాయని జిల్లా ఆయూష్ నోడల్ అధికారి డాక్టర్ జె.గంగాదాస్ తెలిపారు. ఈ సందర్భంగా నగరంలోని ప్రభుత్వ దవాఖానలో శనివారం యోగా డే నిర్వహించారు. ప్రాణాయామం, ఆసనాలు, యోగా ప్రాముఖ్యతను వివరించారు. ముఖ్య అతిథిగా హాజరైన ప్రభుత్వ వైద్య కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శివప్రసాద్ మాట్లాడుతూ.. నిత్యం యోగా సాధన చేస్తే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని తెలిపారు. యోగా గురువు డాక్టర్ తిరుపతి పలువురితో ఆసనాలు వేయించారు. ఆయూష్ ఫార్మాసిస్టులు పురుషోత్తం, ఉమా ప్రసాద్, నీరజ, యోగా శిక్షకులు విజయ భాస్కర్, రాజేందర్, నమ్రత, సంగీత, దవాఖాన వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## చికిత్స పొందుతూ మహిళ మృతి

వినాయక్‌నగర్, మే 31: జిల్లా ప్రభుత్వ దవాఖానలో చికిత్స పొందుతున్న గుర్తు తెలియని మహిళ మృతిచెందిందని వన్‌టౌన్ ఎస్‌హెచ్‌వో బి.రఘుపతి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మృతురాలి వయస్సు 35-40 ఏండ్ల మధ్య ఉంటుందని పేర్కొన్నారు. ఎలాంటి ఆధారాలు లేవని, డెడ్‌బాడీని దవాఖాన మార్చురీలో ఉంచినట్లు తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు 8712659714 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని సూచించారు.

## పంట మార్పిడి పద్ధతిని అవలంబించాలి

వర్ని, మే 31: రైతులు పంట మార్పిడి పద్ధతిని అవలంబించాలని శాస్త్రవేత్తలు సూచించారు. మండలంలోని జాకోర రైతువేదికలో శనివారం రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమాన్ని నిర్వహించారు. రైతులు వ్యవసాయంతోపాటు పాడి పశువులు, కోళ్ల పెంపకంపై దృష్టి సారించి, అదనపు ఆదాయం పొందాలన్నారు. యూరియా వాడకాన్ని తగ్గించాలని, పచ్చిరొట్ట ఎరువులను వినియోగించాలని సూచించారు. పొటాష్ ఎరువులను రెండు దఫాలుగా వేయాలని, మైక్రో క్లస్టర్లు ఏర్పాటు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ఎం.రాజశేఖర్, రైస్ రీసెర్చ్ స్టేషన్ శాస్త్రవేత్త డాక్టర్ ఫిర్దోస్ షహానా, జాకోర ఏఈవో సుధీర్, రైతులు పాల్గొన్నారు.

## పశువుల కొనుగోలు కేంద్రాల తనిఖీ



పశువుల కొనుగోలు కేంద్రాన్ని తనిఖీచేస్తున్న సీపీ సాయిచైతన్య

బోధన్, మే 31: రెంజల్ మండలం సాటాపూర్, బోర్గాం గ్రామ సరిహద్దుల్లోని పశువుల కొనుగోలు కేంద్రాలను శనివారం నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య తనిఖీచేశారు. ఈ సందర్భంగా పశువుల కొనుగోలుకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. ఎక్కడా ఎలాంటి అవకతవకలకు తావివ్వకుండా తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సీపీ వెంట బోధన్ ఏసీపీ శ్రీనివాస్, రెంజల్ ఎస్సై చంద్రమోహన్, జిల్లా పశువైద్యాధికారి డాక్టర్ రోహిత్‌రెడ్డి, గ్రామ కార్యదర్శి మహబూబ్ అలీ తదితరులు పాల్గొన్నారు.

## అనాథ వృద్ధాశ్రమానికి రూ.లక్ష విరాళం



విరాళాన్ని అందిస్తున్న శ్రీనివాస్‌రెడ్డి కుటుంబసభ్యులు

బోధన్, మే 31: మోస్రా మండలం చింతకుంట గ్రామంలోని చింతకుంట ఉచిత అనాథ వృద్ధాశ్రమానికి బోధన్ పట్టణానికి చెందిన జిల్లా చెరుకు ఉత్పత్తిదారుల సంఘం అధ్యక్షుడు కూచన్‌పల్లి శ్రీనివాస్‌రెడ్డి కుటుంబం వారి కుమారుడు వెంకట్రామరెడ్డి జ్ఞాపకార్థం రూ.లక్ష విరాళాన్ని అందించింది. ఈ మేరకు శనివారం అనాథాశ్రమంలో ఈ మొత్తాన్ని నగదు రూపంలో ఆశ్రమ నిర్వాహకులకు శ్రీనివాస్‌రెడ్డి, తల్లి హేమలత, భార్య సుమ, కుమార్తె త్రిలోక్య, కుమారుడు వేదాంత్‌రెడ్డి అందించారు. అనంతరం అన్నదానం చేశారు.

## ఫ్రెండ్లీ క్రికెట్ మ్యాచ్‌లో విన్నర్ జెన్‌కో

మోర్తాడ్, మే 31: తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురష్కరించుకుని శనివారం ఎస్సారెస్పీ వద్ద నీటిపారుదల శాఖ–జెన్‌కో ఫ్రెండ్లీ క్రికెట్ మ్యాచ్‌ను నిర్వహించగా ఇందులో జెన్‌కో టీం విన్నర్‌గా, నీటిపారుదలశాఖ రన్నర్‌గా నిలిచాయి. ఇరు జట్లకు పర్యవేక్షక ఇంజినీర్ శ్రీనివాస్ షీల్డ్‌లను అందజేశారు. ఉత్తమ బ్యాట్స్‌మన్‌గా సబ్ ఇంజినీర్ ప్రవీణ్, ఉత్తమ బౌలర్‌గా జేటీవో జలంధర్‌లకు బహుమతులను అందజేశారు.

నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్

**WANTED**
★AN Infra DVLP సంస్థలో పని చేయుటకు మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్, టీమ్స్ కావలెను. యాదాద్రి సమీపంలో వెంచర్లకు @ రాక్‌టౌన్ కాలనీ, అలకాపురి, L.B.Nagar, హైదరాబాద్. సంప్ర: 9989747788.
NT-325337-All

**FINANCE**
★Project Finance... MSME, CGTSME, Seed Funding, Private Equity, Venture Capital, Laisoning Services @ KPHB. 7032631468.
NT-350515-All

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల క్లాసిఫైడ్స్ 200/- మాత్రమే, ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే
"పేరు మార్పిడి" ప్రకటన 4 లైన్లకు 250/- ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే
GST వర్తించును
సెల్: 91827 77590

**గమనిక**
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

# దాబా హోటళ్లపై ఆకస్మిక దాడులు




యజమానులకు నోటీసులు అందజేస్తున్న అటవీ అధికారులు, పోలీసు సిబ్బంది

నందిపేట్, మే 31 : అటవీశాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నందిపేట్, డొంకేశ్వర్ మండలాల పరిధిలోని గ్రామాల్లో ఉన్న దాబాలపై మండల ఎస్సై సాయంతో అటవీశాఖ, పోలీసు సిబ్బంది ఉమ్మడిగా కలిసి దాడులు చేశారు. దాబాల్లో వన్య ప్రాణులు అయినటువంటి కుందేళ్లు, నెమళ్లు, దుప్పులు తదితర జంతువులను వండకూడదని అధికారులు సూచించారు. ఎవరూ వణ్యప్రాణులకు హాని కలిగించరాదని, వేటాడరాదని హోటల్ యజమానులకు నోటీసులు అందించారు. హోటల్‌లో నిల్వ ఉన్న మాంసాహారాలను పరీక్షించారు. వారికి వన్య ప్రాణి చట్టంపై అవగాహన కల్పించి ఎవరైనా వన్యప్రాణులను వండితే వారిపై 1972 వైల్డ్‌లైఫ్ యాక్ట్ ప్రకారం నాన్‌బెయిలబుల్ కేసు నమోదు చేసి హోటల్స్ సీజ్ చేస్తామని హెచ్చరించారు. తనిఖీల్లో ఎస్సై చిరంజీవి, డిప్యూటీ రేంజ్ ఆఫీసర్లు సుధాకర రణవీర్, అశోక్, గణేశ్, ఉత్తమ్ పాల్గొన్నారు.

## నాణ్యమైన విత్తనాలు విక్రయించాలి

ఆర్మూర్‌టౌన్, మే 31: వానకాలం ప్రారంభమవుతుందని, రైతులకు నాణ్యమైన ఎరువులు విక్రయించాలని ఏసీపీ వెంకటేశ్వర్‌రెడ్డి, ఏవో హరికృష్ణ సూచించారు. పట్టణంలోని పలు ఎరువులు విక్రయించే దుకాణాలను శనివారం తనిఖీ చేసి వారు మాట్లాడారు. రైతులు విత్తనాలు, ఎరువులు కొనుగోలు విషయంలో జాగ్రత్తలు పాటించాలన్నారు. నాణ్యమైన విత్తనాలు కొనుగోలు చేసి వాటి బిల్లులను తీసుకోవాలన్నారు. దుకాణాదారుల లైసెన్స్, వారు విక్రయిస్తున్న విత్తనాలను పరిశీలించామని పేర్కొన్నారు. నకిలీ విత్తనాలు విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వారివెంట ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ తెలిపారు.

**ఎరువులు, విత్తనాల దుకాణాల తనిఖీ..**

భీమ్‌గల్, మే 31:భీమ్‌గల్‌లో ఎరువులు, విత్తనాల దుఖాణాలను శనివారం వ్యవసాయ శాఖ, పోలీస్ శాఖ ఆధ్వర్యంలో తనిఖీ చేశారు. మండల వ్యవసాయాధికారిణి పి. లావణ్య, ఎస్సై జి. మహేశ్ కలిసి పట్టణంలోని దుఖాణాల్లో ఎరువులు, విత్తనాలకు సంబంధించిన స్టాక్ రిజిస్టర్లను పరిశీలించారు. స్టాక్ బోర్డులు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని సూచించారు. నకిలీ విత్తనాలు అమ్మితే దుఖాణాలు సీజ్ చేస్తామని హెచ్చరించారు, విక్రయాలకు సంబంధించిన బిల్లులు తప్పకుండా ఇవ్వాలన్నారు.

## ఘనంగా అహల్యాబాయి హోల్కర్ జయంతి

బోధన్ రూరల్, మే 31: రాణి అహల్యాబాయి హోల్కర్ జయంతి వేడుకలను శనివారం మండలంలోని కల్దుర్కి గ్రామంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు అహల్యాబాయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. ఆమె చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో కుర్మ సంఘం అధ్యక్షుడు సిరిగిరి రామ్, నాయకులు సిరిగిరి గౌర్‌గొండ, అశోక్ పాల్గొన్నారు.

**ఆలయాల నిర్మాణకర్త అహల్యాబాయి**

సుభాష్‌నగర్, మే 31: లోకమాత మహారాణి అహల్యాబాయి హోల్కర్ హిందూ దేవాలయాల నిర్మాణకర్త అని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ అన్నారు. అహల్యాబాయి జయంతి సందర్భంగా గోల్‌హనుమాన్ మందిరం నుంచి కోటగల్లి మార్కండేయ మందిరం వరకు శోభాయాత్ర నిర్వహించారు. యువత అహల్యాబాయి, ఝూన్సీలక్ష్మీబాయి, రాణిరుద్రమాదేవి వంటి ధీర వనితల గాథలు తెలుసుకొని స్ఫూర్తి పొందాలని సూచించారు. దేవీమాత మండల బీజేపీ అధ్యక్షులు తారక్ వేణుగోపాల్, డివిజన్ నాయకులు పాల్గొన్నారు.

## మంజూరు పత్రాల అందజేత

ఏర్గట్ల, మే 31: మండలంలోని తొర్తి గ్రామపంచాయతీలో 36 మంది ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు ఎంపీవో శివచరణ్ మంజూరు పత్రాలను శనివారం అందజేశారు. కార్యక్రమ ప్రారంభంలో ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం పురస్కరించుకుని పొగాకుకు దూరంగా ఉండాలని ఏఎన్ఎం ఆస్మా ప్రతిజ్ఞ చేశారు. అనంతరం ఎంపీవో మాట్లాడారు. కార్యక్రమంలో గ్రామకార్యదర్శి అనిల్, నాయకులు పాల్గొన్నారు

## బట్టాపూర్‌లో 'ఏర్గట్ల ఎవుసం'

ఏర్గట్ల, మే 31: మండల వ్యవసాయ, ఉద్యాన, పశు సంవర్ధక శాఖ అధికార బృందం ''ఏర్గట్ల ఎవుసం'' అనే కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా మండలంలోని బట్టాపూర్ గ్రామంలో అన్నదాతలకు వానాకాలంలో సాగు సన్నాహకాలపై శనివారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారులు రైతులకు అవగాహన కల్పించారు.

## 3 నుంచి రెవెన్యూ సదస్సులు

జక్రాన్‌పల్లి/మోర్తాడ్,/ముప్కాల్, మే 31: జక్రాన్‌పల్లి మండలంలోని అన్ని గ్రామాల్లో ఈనెల 3 నుంచి రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ కిరణ్మయి ఒక ప్రకటనలో తెలిపారు. భూ సంబంధిత సమస్యలపై రైతులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ నెల 3 నుంచి కమ్మర్‌పల్లి, మోర్తాడ్ మండలాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు తహసీల్దార్లు ప్రసాద్, కృష్ణ తెలిపారు. ఈ నెల 3 నుంచి ముప్కాల్ మండలంలో రెవిన్యూ సదస్సులు చేపట్టనున్నట్లు తహసీల్దార్ ముందాజ్బొద్దీన్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి గ్రామంలో రైతులు వారి భూ సమస్యలను దరఖాస్తుల ద్వారా తెలియపరచాలని సూచించారు.

## ఎస్సారెస్పీలోకి 1736 క్యూసెక్కుల వరద

మోర్తాడ్, మే 31: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌లోకి ఎగువ నుంచి 1,736 క్యూసెక్కుల వరద వస్తున్నట్లు అధికారులు తెలిపారు.ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం 1091అడుగులు (80.5టీఎంసీలు) కాగా ప్రస్తుతం ప్రాజెక్ట్‌లో 1062.20అడుగులు(12.788టీఎంసీలు)నీటినిల్వ ఉన్నది. ప్రాజెక్ట్ నుంచి 100 క్యూసెక్కుల నీరు కాకతీయ కాలువకు, 231 క్యూసెక్కుల నీరు మిషన్ భగీరథకు విడుదల చేస్తుండగా, 341 క్యూసెక్కుల నీరు ఆవిరిరూపంలో వెళ్తున్నట్లు అధికారులు తెలిపారు.

## మహిళా ఆర్థికాభివృద్ధికి కృషి

నవీపేట, మే 31: సమాజంలో మహిళలు అన్ని రంగాల్లో ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు కృషి చేస్తున్నట్లు రాష్ట్ర స్థాయి గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ స్టేజ్ ప్రాజెక్టు మేనేజర్ భారతి పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మండల సమాఖ్య మహాజన సభకు ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు.

## రాష్ట్ర అవతరణ వేడుకల్లో అంబేద్కర్ ఫొటో పెట్టాలి

మోర్తాడ్,మే 31:జూన్ 2న నిర్వహించనున్న రాష్ట్ర అవతరణ వేడుకల్లో ప్రపంచ మేధావి డాక్టర్ అంబేద్కర్ ఫొటోను పెట్టాలని మండల దళితసంక్షేమసంఘం నాయకులు డిమాండ్ చేశారు. శనివారం మోర్తాడ్‌లో వారు విలేకరులతో మాట్లాడారు.

## వైభవంగా బోనాల పండుగ

వేల్పూర్,మే 31: మండలంలోని రామన్నపేట్ గ్రామంలో శనివారం ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో పండుగ నిర్వహించారు. బోనా లు, డప్పువాయిద్యాలతో ర్యాలీగా వెళ్లి అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

## ఫిట్స్‌తో మేస్త్రీ మృతి

భీమ్‌గల్, మే 31: మండలంలోని సుదర్శన్‌నగర్ తండాలో ఇంటి నిర్మాణ పనుల్లో ఉండగా ఫిట్స్ రావడంతో పరంచాపై నుంచి కిందపడి మేస్త్రీ లత్తిపోగు ప్రకాశ్ (50) మృతిచెందినట్లు ఎస్సై జి. మహేశ్ శనివారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. ప్రకాశ్ తండాలో బూక్య గంగాధర్ ఇంటి ఎలివేషన్ పనుల్లో భాగంగా పరంచా పైకి ఎక్కి పనులు చేస్తున్నాడు. ఇదే సమయంలో అతడికి ఫిట్స్ రావడంతో పై నుంచి కింద పడి కొట్టుకుంటుండగా వెంటనే 108 అంబులెన్సులో ఆర్మూర్ దవాఖానకు తరలించారు. అక్కడ పరీక్షించిన వైద్యులు నిజామాబాద్ ప్రభుత్వ దవాఖానకు తరలించాలని సూచించగా, అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## మెడికల్ టెస్టు కోసం హైదరాబాద్ వెళ్లిన వ్యక్తి అదృశ్యం

నవీపేట, మే 31: బతుకు దెరువు కోసం గల్ఫ్ వెళ్లేందుకు గాను హైదరాబాద్‌లో మెడికల్ పరీక్షకు వెళ్లిన ఓ వ్యక్తి అదృశ్యమయ్యాడు. ఏఎస్సై మోహన్‌రెడ్డి కథనం ప్రకారం.. నవీపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని జలాల్‌పూర్ గ్రామానికి చెందిన కొండపల్లి శ్రీనివాస్ గల్ఫ్ దేశం వెళ్లేందుకు గాను గత నెల 27న హైదరాబాద్‌కు మెడికల్ పరీక్ష నిమిత్తం బస్సులో బయల్దేరాడు. ఆ రోజు మెడికల్ పరీక్ష కాకపోవడంతో ఇంటికి ఫోన్ చేసి రేపు మెడికల్ అయిన తర్వాత వస్తానని చెప్పాడు. గతనెల 28న శ్రీనివాస్‌కు ఫోన్ చేయగా ఫోన్ స్విచ్‌ఆఫ్ వచ్చింది. అప్పటి నుంచి భార్య రూప భర్త ఆ చూకీ కోసం ఎదురు చూసినా ఫలితం లేక పోయింది. భార్య రూప ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై మోహన్‌రెడ్డి పేర్కొన్నారు.

## బడాభీమ్‌గల్‌లో దొంగల బీభత్సం

భీమ్‌గల్, మే 31: మండలంలోని బడాభీమ్‌గల్ గ్రామంలో శుక్రవారం రాత్రి దొంగలు బీభత్సం సృష్టించారు. గ్రామానికి చెందిన కాళ్లగడ్డ నర్సు తన ఇంటికి తాళం వేసి కొడుకు ఇంటికి వెళ్లి నిద్రించింది. ఉదయం వచ్చి చూడగా దొంగలు ఇంటి తాళం పగులగొట్టి ఇంట్లో ఉంచిన రూ. 20 వేల నగదును ఎత్తుకెళ్లారు. అదే రోజు రాత్రి గున్నాల ఉమకు చెందిన ఇంటి తాళాలు కూడా పగుల గొట్టి ఇంట్లో ఉంచిన రూ. 10 వేల నగదును ఎత్తుకెళ్లారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాపు చేస్తున్నట్లు స్థానిక ఎస్సై జి. మహేశ్ తెలిపారు.

## మోటార్ సైకిల్ చోరీ

నవీపేట, మే 31: మండల కేంద్రంలోని ధర్యాపూర్ కాలనీలో ఓ మోటార్ సైకిల్‌ను గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించుకుపోయారని ఏఎస్సై మోహన్‌రెడ్డి శనివారం తెలిపారు. ధర్యాపూర్‌కు చెందిన పిల్లి కిషన్ గత నెల 26న తన ఇంటి ముందర పార్కింగ్ చేసి నిద్ర పోగా అదే రాత్రి గుర్తు తెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. చుట్టు పక్కల గ్రామాల్లో వెతికినా ఆచూకీ లభించక పోవడంతో ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై పేర్కొన్నారు.

## పేకాటరాయుళ్ల అరెస్ట్

బోధన్, మే 31: బోధన్ రైల్వే స్టేషన్ సమీపంలో లయన్స్ కంటి దవాఖాన వెనుక పేకాడుతున్నారన్న సమాచారం మేరకు శనివారం పోలీసులు దాడి చేసి ఐదుగురు పేకాటరాయుళ్లను అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ.1970 నగదు, రెండు బైక్‌లు, ఆరు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నామని, వారిపై కేసు నమోదు చేసినట్లు బోధన్ టౌన్ సీఐ వెంకటనారాయణ తెలిపారు.

## అక్రమ ఇసుక డంపులు సీజ్

నవీపేట, మే 31: మండలంలోని నిజాంపూర్‌లో అక్రమ ఇసుక డంపులను శనివారం సీజ్ చేసినట్లు తహసీల్దర్ వెంకటరమణ తెలిపారు. కొన్ని రోజుల నుంచి ఎటువంటి అనుమతులు లేకుండా నిజాంపూర్ వాగులో నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తూ రహస్య ప్రదేశాల్లో డంపు చేశారని తెలిపారు. పక్కా సమాచారం మేరకు తమ సిబ్బందితో దాడి చేసి ఆరు చోట్ల అక్రమ ఇసుక డంపులను సీజ్ చేసినట్లు తహసీల్దార్ పేర్కొన్నారు. సీజ్ చేసిన డంపులను ఇందిరమ్మ ఇండ్లకు సరఫరా చేస్తున్నట్లు చెప్పారు.